# శ్రీ పద్ధతిలో వరిసాగు ఆరుతడి పంటగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుర్తింపు

గత రెండు సంవత్సరాల నుండి 'శ్రీ' పద్ధతిలో వరిసాగు విధానాన్ని రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో రైతులు ప్రయోగాత్మకంగా చేపట్టి లాభాలు గడించి మరెంతో మంది రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, 'డాట్' కేంద్రాలు, వ్యవసాయ శాఖ, ఇక్రిసాట్ - డబ్ల్యు.డబ్ల్యు.ఎఫ్, సుస్థిర వ్యవసాయ కేంద్ర, వాసన్ అనేక జిల్లాలలో 'శ్రీ' పద్ధతిలో వరిసాగు విధానం ప్రక్రియను పెద్ద ఎత్తున ప్రచారాన్ని చేపట్టాయి. ఆయా ప్రాంతాలలో అనేకమంది రైతులు విశేష అనుభవాన్ని గడించి అధిక దిగుబడులు సాధించారు. ఈ రైతుల అనుభవాలు మరెందరికో ఆదర్శంగా నిలిచాయి. ఈ రైతుల అనుభవాలను ఎప్పటికప్పుడు సమగ్ర పరుస్తూ జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో అనేక సెమినార్లు, వర్కుషాపులు, సమావేశాలు నిర్వహించారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఇక్రిసాట్-డబ్ల్యు.డబ్ల్యు.ఎఫ్., వాసన్, మరికొన్ని స్వచ్ఛంద సంస్థలు, రైతు సంఘాలు విధానపరమైన సమాలోచనలు జరిపి ప్రభుత్వానికి నివేదించాయి. వ్యవసాయ శాఖ కమీషనరు శ్రీమతి పూనం మాల కొండయ్య, వ్యవసాయ శాఖమంత్రి శ్రీ రఘువీరా రెడ్డి నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించి రైతులతో ప్రత్యక్షంగా వారి అనుభవాలను తెలుసుకోవడానికి 'శ్రీ'వరి క్షేత్ర సందర్శన చెయ్యాలని భావించి ముఖ్యమంత్రి శ్రీ రాజశేఖర్‌రెడ్డిని ఆహ్వానించారు.

నవంబరు 15, 2005 రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలంలోని తారామతి పేట గ్రామానికి చెందిన నాగరత్నం నాయుడు క్షేత్రాన్ని ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖమంత్రి, ఇతర మంత్రులు, శాస్త్రవేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రైతులు పరిశీలించారు. రంగారెడ్డి, మహబూబ్‌నగర్, అనంతపురం, వరంగల్, మెదక్, పశ్చిమగోదావరి, గుంటూరు జిల్లాల్లో గత రెండు సంవత్సరాలుగా 'శ్రీ' పద్ధతిలో వరి సాగు చేస్తున్న సుమారు 60మంది రైతులు వారి అనుభవాలను, సాధించిన ఫలితాలను ఈ పద్ధతిలో వున్న లాభ నష్టాలను, మరింత మెరుగుగా చేయడానికి సూచనలు, సలహాలను ముఖ్యమంత్రికి, ఇతర మంత్రులకు శాస్త్రవేత్తలు సవివరంగా వివరించారు. అనుభవాలన్ని ప్రత్యక్షంగా చూసిన ముఖ్యమంత్రి రైతులను అభినందించి 'శ్రీ' పద్ధతిలో వరిసాగును 'ఆరుతడి' పంటగా గుర్తిస్తున్నట్లు ప్రకటించారు. ఈ విధానాన్ని మరింత ప్రచారం చెయ్యాలని రైతులకు అవసరమైన శిక్షణ అందించాలని, అందు కోసం రాష్ట్రంలో కనీసం 20,000 గ్రామాలలో ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేయాలని, ఈ శిక్షణల కోసం 4 కోట్ల రూపాయలను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. వ్యవసాయ పరికరాలను సబ్సిడీతో అందించడం కోసం 17 కోట్ల రూపాయలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు.

| 'శ్రీ' పద్ధతిలో లాభాలు - రైతుల అనుభవాలు | 'శ్రీ' పద్ధతిలో ఇబ్బందులు - రైతుల అనుభవాలు |
|---|---|
| ⌘ విత్తనం తక్కువ, ఎకరానికి 2 కిలోలు<br>⌘ నీరు తక్కువ<br>⌘ కరెంటు ఆదా<br>⌘ రసాయనిక మందులు వాడకపోవడం వల్ల ఖర్చు తక్కువ<br>⌘ అధిక దిగుబడి<br>⌘ త్వరగా నాటు వేయవచ్చు (8-12 రోజులు)<br>⌘ త్వరగా కోతకు వస్తుంది (10 రోజులు ముందు)<br>⌘ గాలికి పడదు<br>⌘ దోమపోటు తక్కువ<br>⌘ గింజ బరుకు ఎక్కువ | ⌘ నారుమడి శ్రద్ధగా పెంచాలి<br>⌘ నాటు గుర్తులకు మార్కరు పరికరంగా అందుబాటులో ఉండటం లేదు<br>⌘ పశువుల పెండ అధికంగా వాడాలి<br>⌘ నాటు వేసేటప్పుడు జాగ్రత్తగా వేయాలి<br>⌘ కూలీలకు మొదటిసారి శిక్షణ ఉండాలి<br>⌘ చేనులో నీరు నిల్వ ఉండకుండా చూడాలి<br>⌘ 10రోజులకు ఒకసారి కనీసం 4, 5 సార్లు వీడర్ తిప్పాలి<br>⌘ వీడర్లు అందుబాటులో లేవు<br>⌘ కోనో వీడర్ కొన్ని భూములలో మాత్రమే పని చేస్తుంది<br>⌘ నేల స్వభావాన్ని బట్టి వీడర్ తయారు చేయాలి. అది అందుబాటులో ఉండాలి<br>⌘ చౌడు భూములలో 'శ్రీ' పద్ధతి మంచి ఫలితాలు సాధించలేదు. |

## 'శ్రీ' పద్ధతిలో వాసన్

వాసన్ నిర్వహిస్తున్న క్లస్టర్ స్థాయి జీవనోపాధుల వనరుల కేంద్రం - పరిగిలో 'శ్రీ' పద్ధతిపై వాటర్‌షెడ్, సిఎల్‌డిపి గ్రామంలో అవగాహన శిక్షణా కార్యక్రమాలు నిర్వహించింది. సుమారుగా 3 వాటర్‌షెడ్ గ్రామాలు, 2 సిఎల్‌డిపి గ్రామాలలో 'శ్రీ' పద్ధతిలో 20 మంది రైతులు 25 ఎకరాలలో ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేసుకున్నారు. రబీ కోసం మిగిలిన అన్ని వాటర్‌షెడ్ గ్రామాలలో 'శ్రీ' పద్ధతిలో వరిసాగు విధానంపై శిక్షణా కార్యక్రమాలు, సందర్శన యాత్రలు నిర్వహిస్తున్నారు.

గత సంవత్సరం మహబూబ్‌నగర్‌లోని కోస్గి, దౌలతాబాద్ మండల మహిళా సమాఖ్యల ద్వారా సుమారుగా 10 గ్రామాలలో 30మంది రైతులతో 'శ్రీ' పద్ధతిలో వరిసాగు ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేసుకున్నారు. రబీ పంట కోసం విస్తృతంగా ప్రచారం, రైతు సందర్శన యాత్రలు నిర్వహిస్తున్నారు.

వీడర్ పరికరం యొక్క ప్రాధాన్యతను, అవసరాన్ని గుర్తించి రాష్ట్రంలో వివిధ రకాల పరికరాలను ఉపయోగించిన వారితో, స్వంతంగా పరికరాన్ని తయారు చేసుకున్న అనుభవం ఉన్న రైతులలో - వీడర్ పరికరాలతో ఒక వర్క్‌షాపు జూన్, 2005లో నిర్వహించి, వీడర్ పరికరాలపై పరిశోధించి, అనేక రకాల వీడర్ పరికరాలను అందుబాటులోనికి తెచ్చింది. రైతులు స్వంతంగా తెచ్చిన స్టార్ వీడర్ పరికరం ప్రస్తుతం ఎక్కువ మన్నికలో ఉంది. దీనిని 500 రూపాయలకే రైతులకు అందుబాటులో తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది.

'శ్రీ' పద్ధతిలో వరిసాగు విధానం గురించిన పుస్తకాలు, చిత్ర మాలికలు, పోస్టర్, సిడిలను రైతులకు అందుబాటులోకి తెచ్చింది.

'శ్రీ' వరిసాగులో రసాయనిక మందులకు ప్రత్యామ్నాయంగా పంచగవ్య, అమృతజలం తయారీ విధానాన్ని పరీక్షించి అందుబాటులోకి తెచ్చింది.

**చర్చ :**

నూతన విధానంపై స్వచ్ఛంద సంస్థల పాత్ర ఏమిటి?

20,000 గ్రామాలలో ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేయడానికి స్వచ్ఛంద సంస్థలు భాగస్తులు కాగలరా?

శిక్షణ కార్యక్రమాలను నిర్వహించగలరా?